# నూతన టెలికం విధానం 2011 పై జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతిపాదనలు

భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న టెలికం రంగాన్ని ఆక్రమించాలన్న కుట్రలో భాగంగా భారతదేశ మరియు విదేశీ బడా పెట్టుబడిదారుల ఒత్తిడి మేరకు 1994లో కీ॥శే॥ శ్రీ పి.వి. నరసింహారావు ప్రభుత్వంలో జాతీయ టెలికం విధానం మరియు వాజ్‌పేయి ప్రభుత్వంలో 1999లో నూతన టెలికం విధానం రూపొందించబడ్డాయి.

ప్రజా వ్యతిరేకమైన టెలికం విధానాల ఫలితంగా 1997లో 1.53 కోట్లుగా వున్న టెలికం వినియోగదారుల సంఖ్య (సెల్+ లాండ్‌లైన్), మే 2011 నాటికి 82 కోట్లకు చేరుకున్నా రీసెర్చి మరియు డెవలప్‌మెంట్ రంగంలో అధోగతికి చేరుకున్నాం. టెలికం పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం లాంటి అంశాలలో పూర్తిగా ఆగిపోయి, మొబైల్ సాంకేతికత మరియు పరికరాల రంగంలో పూర్తిగా విదేశీ తయారీ కంపెనీలైన నోకియా, ఎరిక్‌సన్, శాంసంగ్, మోటరోలా, హువాయ్, జడ్‌టిఇ వాటిపై ఆధారపడ్డాం. స్వదేశీ టెలికం పరికరాల తయారీ కంపెనీలైన ఐటిఐ, హెచ్‌సిఎల్ లాంటి నష్టాలలో నడుస్తూండగా, భారతీయ రీసెర్చి మరియు డెవలప్‌మెంట్ రంగంలోని సి-డాట్ సంస్థలు ప్రభుత్వ వ్యతిరేక చర్యల వల్ల హత్య చేయబడ్డాయని భావించాలి.

1997 నుండి 2011 దాకా టెలిఫోన్ వినియోగదారుల సంఖ్యలో దాదాపు 52 రెట్లు పెరుగుదల వచ్చినా, మొత్తం టెలికం రంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య సర్వీసులు మరియు ఉత్పత్తి రంగాలలో కలుపుకున్నా గణనీయంగా తగ్గింది. మరోవైపు తక్కువ రేటు చెల్లించే క్యాజువల్/కాంట్రాక్టు కార్మికుల సంఖ్య చెప్పుకోదగిన విధంగా పెరిగింది.

ప్రైవేటు టెలికం కంపెనీలు కేవలం లాభాపేక్షతోనే నడుస్తూ, దేశ రక్షణనే పణంగా పెడుతున్నాయి. ప్రైవేటు టెలికం కంపెనీల నెట్‌వర్క్‌లన్నీ పూర్తిగా విదేశీ టెలికం కంపెనీలే నెలకొల్పి నిర్వహిస్తున్నాయి. తద్వారా దేశరక్షణను గాలికి వదిలేశారు. మరోవైపు ప్రభుత్వం టెలికం కంపెనీలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 49% నుండి 74% పెంచింది. ఆ తర్వాత పరోక్షంగా 74% మించి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తోంది. ఫలితంగా అనేక ప్రైవేటు టెలికం కంపెనీలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితి 50% మించింది. తద్వారా విదేశీ పెట్టుబడిదారులు ఈ కంపెనీలకు యజమానులుగా వ్యవహరిస్తూ, దేశరక్షణను పణంగా పెడుతున్నారు.

ఇందువల్ల దేశరక్షణను దృష్టిలో వుంచుకొని, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో సైతం టెలికం సర్వీసుల అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని ఆధునిక టెలికం సాంకేతికత అన్ని రకాల ప్రజలకు అందుబాటులో వుండేలాగు ప్రభుత్వరంగంలోని సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఉత్పత్తి మరియు సర్వీసుల రంగంలో టెలికం రంగంలోని ప్రభుత్వరంగ సంస్థలను ఎలాగైనా నాశనం చేయాలనే దిశగా ప్రభుత్వ విధానాలు వుంటున్నాయి. పెట్టుబడుల ఉపసంహరణ, స్వచ్ఛంద పదవీ విరమణ ఈ సంస్థలను వివిధ విభాగాలుగా విడగొట్టడం, అన్‌బండ్లింగ్, పనుల కాంట్రాక్టీకరణ, ఉద్యోగాల కాంట్రాక్టీకరణ లాంటివి అమలుచేస్తూ ప్రభుత్వం తన ఉద్దేశ్యాలను నెరవేరుస్తోంది. ఈ విధానాలకు వ్యతిరేకంగా బిఎస్ఎన్ఎల్‌లోని అధికారులు మరియు నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు జరిగాయి. బిఎస్ఎన్ఎల్‌ను అభివృద్ధి చేయడం కోసం ఎప్పటికప్పుడు జిఎస్ఎం పరికరాల కొనుగోలు జరిగేలా చూడటమే ఈ పోరాటాల ప్రధానోద్దేశం.

విదేశీ, స్వదేశీ బడా పెట్టుబడిదారులు సమైక్యంగా, బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్, ఐటిఐ, హెచ్‌సిఎల్, సిడాట్ తదితర సంస్థలపై కొనసాగిస్తున్న దాడికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. ఈ బడా పెట్టుబడిదారుల ఉద్దేశ్యం ఒక్కటే. టెలికం రంగాన్ని దోపిడీ చేయడం. స్వదేశీయంగా ఈ రంగంలో స్వయం ప్రతిపత్తిగా నిలదొక్కుకోకుండా చూడటం.

భారత టెలికం రంగంలో విదేశీ పెట్టుబడిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వం, ప్రైవేటు టెలికం రంగంలోని పెద్ద కంపెనీ అయిన ఎయిర్‌టెల్ విదేశాలలోని కంపెనీలను కొనుగోలు చేసేలా అనుమతిస్తూ, స్వదేశంలో టెలికం రంగపు స్వయం సమృద్ధికి దోహదం చేసే చర్యలు తీసుకోవడం లేదు.

భారతదేశంలో టెలికం రంగపు సమృద్ధి ఎలా సాధించాలో చైనా అనుభవం నుంచి నేర్చుకోవచ్చు. చైనా ప్రభుత్వం టెలికం రంగంలో ప్రైవేటు కంపెనీలను అనుమతించదు. టెలికం సర్వీసులను ప్రభుత్వరంగ కంపెనీలే నిర్వహిస్తాయి. విదేశీ టెలికం పరికరాల ఉత్పత్తిదారులు చైనాలో తమ కంపెనీలను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే ఆ కంపెనీలో విదేశీ కంపెనీల వాటా

స్వదేశీయుల వాటా కంటే తక్కువగా వుండాలి. కొంతకాలం తర్వాత పరికరాల తయారీ టెక్నాలజీని చైనాకు నేర్పించి బదిలీ చేయాలి. చైనాకు ఉన్న భారీ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని విదేశీ టెలికం కంపెనీలు ఈ నిబంధనని అంగీకరించక తప్పలేదు. ఈ రకంగా టెలికం సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించిన చైనా దాన్ని మరింతగా అభివృద్ధి చేసుకున్నాయి. ఈరోజున చైనా టెలికం పరికరాల తయారీ కంపెనీలైన హువాయి, జడ్‌టియిలు మోటరోలా, ఎరిక్‌సన్, నోకియా లాంటి ఇతర జిఎస్ఎం/సిడిఎంఏ పరికరాల తయారీ సంస్థలతో పోటీపడుతూ భారత్‌తో సహా అనేక ఇతర దేశాలకు తమ పరికరాలను అమ్ముతున్నాయి. అనేక చైనా కంపెనీలు మొబైల్ పరికరాలను ఎగుమతి చేస్తున్నాయి. చైనా టెలికం నియోగదారుల సంఖ్యలో ప్రపంచంలోనే మొదటిస్థానంలో వుంది.

విదేశీ పరికరాల తయారీ సంస్థల ఒత్తిడికి లొంగి, నిబంధనలు సడలించి దేశరక్షణను సైతం ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. భారతీయ నిఘా సంస్థలు, విదేశాల నుండి దిగుమతి అవుతున్న టెలికం పరికరాలలో గూఢచర్యానికి తావిచ్చే పరికరాలు వుంచే అవకాశం వుందని హెచ్చరించాయి. దీంతో విదేశీ పరికరాల తయారీదారులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని రాబోయే మూడు సంవత్సరాలలో భారతీయ సంస్థలకు అందజేయాలని 2010లో భారత ప్రభుత్వం ఆదేశించింది. అలాగే పరికరాలను ఇన్‌స్టాల్ చేసేటపుడు భారతీయులు వుండాలనీ, పరికరాల అజమాయిషీ మరియు నెట్‌వర్క్ నిర్వహణ కూడా భారతీయులే చేయాలనీ, అలాగే పరికరాల రహస్య కోడ్‌లను, సోర్సు కోడ్‌లను ఎస్క్రో అకౌంట్‌లో వుంచాలనీ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఆదేశాలను మోటరోలా, నోకియా, ఎరిక్‌సన్ లాంటి విదేశీ సంస్థలు వ్యతిరేకించాయి. చైనా తయారీ సంస్థలు సోర్సు కోడ్‌లు ఇవ్వడానికి ఎస్క్రో అకౌంట్‌లో వుంచడానికి అంగీకరించాయి. అమెరికన్, యూరోపియన్ పరికరాల తయారీ సంస్థల ఒత్తిడికి లొంగిన ప్రభుత్వం 31.5.2011న తన నిబంధనల్ని సడలిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. సడలించిన ఈ మార్గదర్శకాల ప్రకారం విదేశీ సంస్థలు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతీయ సంస్థలకు అందించాల్సిన అవసరం లేదు. వారి సోర్సు కోడ్‌లను ఎస్క్రో అకౌంట్‌లో వుంచాల్సిన అవసరం లేదు. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా తప్ప ఇతర స్థాయిలలో విదేశీయులే నెట్‌వర్క్‌ని నిర్వహించవచ్చు. ఈ రకంగా దేశరక్షణను పణంగా పెట్టి, టెలికం కంపెనీలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లయింది. టెలికం కంపెనీలన్నీ నిర్ధారిత ఏజెన్సీ ద్వారా తమ నెట్‌వర్క్ సెక్యూరిటీని ఆడిట్ చేయించవల్సి వుంటుంది. అలాగే వినియోగదారుడు ఏ ప్రాంతం నుండి ఫోను చేస్తున్నాడో తెలుసుకునే వ్యవస్థని అన్ని టెలికం కంపెనీలు రాబోయే రెండేళ్ళలో నెలకొల్పవలసి వుంటుంది. ఇప్పటి అంచనాల ప్రకారం ఈ వ్యవస్థ ఏర్పాటుకు ఒక్కో టెలికం కంపెనీకీ దాదాపుగా 5000 నుండి 5800 కోట్లు ఖర్చు అవుతుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేయాల్సి వస్తోంది కనుక ఈ ఖర్చుని ప్రభుత్వమే భరించాలని టెలికం కంపెనీలు వాదిస్తున్నాయి. ఈ రకంగా టెలికం రంగంలోని నెట్‌వర్క్ రక్షణ వ్యవస్థ ఖర్చు విదేశీ కంపెనీల నుండి భారతీయ టెలికం కంపెనీలకు, వారి నుండి ప్రభుత్వ ఖజానాకు భారంగా మారనున్నాయి.

పై అంశాలన్నింటినీ దృష్టిలో వుంచుకొని నూతన టెలికం విధానం 2011లో ఈ క్రింది ముఖ్యమైన అంశాలను చేర్చాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం.

అ) టెలికం రంగంలోని ప్రభుత్వరంగ సంస్థలు స్వయం ప్రతిపత్తితో పరికరాల తయారీ సర్వీసు రంగం, మరియు రీసెర్చి & డెవలప్‌మెంట్ రంగాలలో అభివృద్ధి చెంది, దేశరక్షణ మరియు అత్యవసర పరిస్థితులలో ఎవరి పైనా ఆధారపడకుండా వుండే విధానాన్ని రూపొందించాలి.

ఆ) టెలికం పరికరాల తయారీ ప్రభుత్వరంగ సంస్థలైన ఐటిఐ, హెచ్‌సిఎల్ మరియు బిఎస్ఎన్ఎల్‌లోని టెలికం ఫ్యాక్టరీలకు ప్రోత్సాహం కల్పించాలి. ప్రభుత్వరంగ సంస్థలైన బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌తో పాటు, ప్రైవేటు టెలికం కంపెనీలైన ఎయిర్‌టెల్, వొడాఫోన్ లాంటి సంస్థలు కూడా ప్రభుత్వరంగంలోని పిఎస్‌యు వద్దనే పరికరాలు కొనుగోలు చేసేలా నిబంధనలు విధించాలి. భారతీయ తయారీ పరికరాల ఉత్పత్తిని, కొనుగోలును అమ్మకాలను ప్రోత్సహించాలి. రీసెర్చి మరియు డెవలప్‌మెంట్ రంగంలో ప్రభుత్వరంగ సంస్థలైన సిడాట్, టిఇసి, ఐటిఐ, బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ తదితర కంపెనీలకు తగిన ఆర్థిక నిధులు అందించాలి.

ఇ) అత్యాధునిక టెలికం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రభుత్వరంగ సంస్థలు సంపాదించేందుకుగానూ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ నిబంధనలతో విదేశీ కంపెనీలతో కలిసి నెలకొల్పాలి. ఈ నెలకొల్పే సంస్థలలో విదేశీ ఈక్విటీ పార్టిసిపేషన్ వుండరాదు.

విదేశీ సంస్థల నుండి పొందిన ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతీయ పరికరాల తయారీ కంపెనీలు తమ రీసెర్చి & డెవలప్‌మెంట్ ద్వారా మరింతగా ఆధునీకరించాలి. ఈ రకమైన భారతీయ రీసెర్చి & డెవలప్‌మెంట్ వ్యవస్థని ప్రభుత్వం మరింతగా బలోపేతం చేయాలి.

ఈ) అన్ని టెలికం కంపెనీలూ తమ నెట్‌వర్క్‌లను తామే స్వయంగా నిర్వహించాలి. అంతేగానీ విదేశీ నెట్‌వర్క్ కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహించరాదు. దేశరక్షణ దృష్ట్యా ఇది అత్యంత అవసరం. విదేశీ పరికరాల తయారీ సంస్థలు తమ తమ సాంకేతిక అంశాలను భారతీయ కంపెనీలకు బదిలీ చేసి, సోర్స్ కోడ్‌ను ఎస్క్రో అకౌంట్‌లో డిపాజిట్ చేయాలి.

ఉ) ప్రైవేటు టెలికం కంపెనీలు, తమతమ కంపెనీలలో పనిచేసే ఉద్యోగులకు ట్రేడ్ యూనియన్ హక్కులను కల్పించాలి. ఈ ఉద్యోగుల జీతభత్యాలు పరస్పర సంప్రదింపుల ద్వారా నిర్ణయించబడాలి.

ఊ) టెలికం రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నిషేధించాలి.

ఎ) ప్రభుత్వరంగ సంస్థలైన బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎల్‌లో పెట్టుబడుల ఉపసంహరణగానీ / కేబుల్ అన్‌బండ్లింగ్ కానీ / ఔట్‌సోర్సింగ్ కానీ అనుమతించరాదు.

ఏ) గ్రామీణ ప్రాంతాలలో మరియు పట్టణ ప్రాంతాలలో లాండ్‌లైన్ల సర్వీసుల నిర్వహణ ద్వారా నష్టాలను చవిచూస్తున్న బిఎస్ఎన్ఎల్‌కు లైసెన్సు ఫీజు చెల్లింపు నుండి మినహాయింపు కల్పించాలి. లాండ్‌లైన్ల నిర్వహణ వ్యవస్థని దేశానికి సంబంధించిన ఆస్తిగా ప్రభుత్వం గుర్తించాలి. ప్రస్తుతానికి లాండ్‌లైన్‌ల ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సర్వీసుల అభివృద్ధి జరిగితే మళ్ళీ లాభాల బాటలో నడుస్తాయి. అప్పటిదాకా బిఎస్ఎన్ఎల్/ఎంటిఎన్ఎల్ సంస్థలకు లైసెన్సు ఫీజు చెల్లింపు నుండి మినహాయింపు ఇవ్వాలి.

ఐ) 3జి మరియు బిడబ్ల్యుఎ స్పెక్ట్రమ్ ఛార్జీలుగా బిఎస్ఎన్ఎల్ నుండి వసూలు చేసిన 18500 కోట్లు తిరిగి చెల్లించాలి. ఎంటిఎన్ఎల్‌కు కూడా ఇదే విధంగా తిరిగి చెల్లించాలి.

ఒ) రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సర్వీసులందరూ తప్పనిసరిగా బిఎస్ఎన్ఎల్/ఎంటిఎన్ఎల్ సర్వీసులనే వాడే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి.

ఓ) ప్రైవేటు రంగంలోని అవినీతి తరహా విధానాల నుండి బిఎస్ఎన్ఎల్/ఎంటిఎన్ఎల్ మేనేజ్‌మెంట్లు బయటపడి ప్రజలకు సేవ చేసే సామాజిక దృక్పథంతో ఆలోచించాలి. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల వారితో సహా అందరు ప్రజలకూ అందుబాటు ధరలతో బ్రాడ్‌బ్యాండ్ మరియు ఇంటర్నెట్ సర్వీసులను అందించాలి. ఇదే సమయంలో ప్రైవేటు టెలికం కంపెనీలు అందించే ఆధునిక సాంకేతికతను అందిస్తూ సంపన్న ఆదాయవర్గాలను ఈ పిఎస్‌యులు ఆకర్షించే విధానాలను రూపొందించాలి. బిఎస్ఎన్ఎల్ / ఎంటిఎన్ఎల్ అభివృద్ధిలో పూర్తి సమిష్టి బాధ్యతను ఐటిఎస్ అధికారులు స్వీకరించాలి.

ఔ) ప్రైవేటు టెలికం కంపెనీలు కూడా ప్రభుత్వరంగ సంస్థలలో లాగా ఎస్సీ/ఎస్టీ/ఒబిసి రిజర్వేషన్లను పాటించి సామాజిక న్యాయాన్ని అమలుచేయాలి.

అం) టెలికం రంగంలో ప్రైవేటు మరియు ప్రభుత్వ కంపెనీలతో సహా అందరికీ ఒకే రకమైన జాతీయ వేతన విధానం వుండాలి. సమానమైన పనికి సమాన వేతనం అనే సూత్రాన్ని అనుసరించి క్యాజువల్ మరియు కాంట్రాక్టు కార్మికుల వేతనం నిర్ణయించ బడాలి.

అః) 2జి స్పెక్ట్రమ్ కుంభకోణంలో లబ్ధిపొందిన ప్రైవేటు టెలికం కంపెనీలను గుర్తించి వారి లైసెన్సులను రద్దు చేయాలి. విలీనాలు మరియు కొనుగోళ్ళ విధానాల వల్ల లైసెన్సు, స్పెక్ట్రమ్ ద్వారా కంపెనీలు గాలివాటు లాభాలు ఆర్జించకుండా తగు విధానాలు రూపొందించాలి.

తేది 24.6.2011
హైదరాబాద్

**బి.ఎస్.ఎన్.ఎల్. ఎంప్లాయీస్ యూనియన్**
**ఆంధ్రప్రదేశ్ సర్కిల్**